క్లుప్తంగా

నాణ్యమైన భోజనం అందించాలి

వేంసూరు: హాస్టల్ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని మెప్మా పీడీ పి.మహేంద్రరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని వేంసూరు, వెంకటాపురం, కుంచపర్తి, అడసర్లపాడు వసతి గృహాలను పరిశీలించారు. హాస్టల్ వంట గదులు, స్టోర్ రూమ్, వంటకు ఉపయోగించే పప్పు దినుసులు, కూరగాయలు, పరిశీలించారు. కార్యక్రమంలో వార్డెన్లు పాల్గొన్నారు.

ముమ్మరంగా సర్వే ఆన్‌లైన్ ప్రక్రియ

కల్లూరురూరల్: మండలంలోని నిర్వహించిన సమగ్ర ఇంటింటి సర్వే దరఖాస్తు ఫారాలను మండల పరిషత్ కార్యాలయంలో ఆన్‌లైన్ ప్రక్రియ చేపట్టారు. ఇప్పటివరకు 90శాతం వరకు సర్వే పూర్తవ్వగా.. వివరాలను సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఈ నెల 30వ తేదీలోగా సర్వే పూర్తి చేసి, అదేవిధంగా ఆన్‌లైన్ నమోదు కూడా పూర్తి చేసే విధంగా అధికారులు కృషి చేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని తహసీల్దార్ పులి సాంబశివుడు, ఎంపీడీఓ దాసరి చంద్రశేఖర్ పరిశీలిస్తున్నారు.

గ్రూప్‌-4 ఉద్యోగం సాధించిన ప్రవళిక


ప్రవళిక

మధిర: మధిర మున్సిపాలిటీ పరిధిలోని జిలుగుమాడుకు చెందిన దేవిశెట్టి కృష్ణ కుమార్తె ప్రవళిక ఇటీవల విడుదలైన గ్రూప్‌-4 ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించి ఓపెన్ క్యాటగిరిలో ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ శాఖ ఖమ్మం నందు ఉద్యోగం పొందారు. చిన్నతనం నుంచే విద్యలో చురుకుగా ఉండే ప్రవళిక పదో తరగతిలో ఉత్తమ ప్రతిభను కనబరిచి ఐఐటీ బాసర నందు సీటు సాధించి ఈసీఈలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించింది. గ్రూప్‌-2 లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు ప్రవళిక తల్లిదండ్రులు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కారేపల్లి: మండల కేంద్రంలో ఐకేపీ కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఐకేపీ సీసీ చైతన్య ఆధ్వర్యాన మండల సమైఖ్య అధ్యక్షురాలు సుహాసిని సమక్షంలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 500 క్వింటాల ధాన్యాన్ని రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరతో పాటు అదనంగా రూ.500 బోనస్‌ను చెల్లిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కారేపల్లి సమైఖ్య నాయకురాలు కృష్ణవేణి, నాగలక్ష్మి, ఏఈఓ మున్ని పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ఏన్కూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్బీఎస్కే ఆధ్వర్యంలో ఎనీమియా ముక్తి భారత్‌లో భాగంగా విద్యార్థులకు సోమవారం హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. రక్తశాతం తక్కువగా ఉన్న విద్యార్థులకు ఐరన్, పోలిక్‌యాసిడ్ మాత్రలను అందించారు. రక్తహీనత నివారించేందుకు ఆకుకూరలు, కూరగాయలు, రాగి జావ మొదలకు పోషక ఆహార పదార్థాలు తీసుకోవాలని వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కూరకుల సైదులు, డాక్టర్ సతీష్, డాక్టర్ సాయి మనిత, ఫార్మసిస్ట్ యాస్మీన్ సుల్తానా, ఏఎన్‌ఎం సత్యవతి పాల్గొన్నారు.

బీమా నగదు అందజేత

ఎర్రుపాలెం: మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన రైతు, సంఘ సభ్యులు యారమల రామకష్టారెడ్డి ఇటీవల మృతి చెందాడు. ఆయనకు సొసైటీలో గ్రూపు ఇన్సూరెన్సు ఉండడంతో.. ఈయన పేరిట రూ.50వేలు బీమా సొమ్ము మంజూరైంది. కాగా ఈనగదును మృతుని సతీమణి హేమలతకు సోమవారం మండలకేంద్రంలోని కోఆపరేటివ్ బ్యాంకు మేనేజర్ దివ్య, సొసైటీ చైర్మన్ అనుమోలు సాంబశివరావులు అందజేశారు. ఈ కార్యక్రమమంలో అసిస్టెంట్ మేనేజర్ సుధాకర్, సీఈఓ మోహన్ రావు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

ఏన్కూరు: ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు భూక్యా వీరభద్రం కోరారు. సోమవారం మండలంలో నిర్వహించిన ఆ పార్టీ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 27నుంచి గ్రామాల్లో స్థానిక సమస్యలపై నిర్వహించే గుర్తింపు యాత్రను ప్రజలు విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగేశ్వరావు, బాలాజీ, రాములు, లెనిన్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉద్యమాలతోనే ప్రజా సమస్యలకు విముక్తి..

ఎర్రుపాలెం: నిరంతరం ఉద్యమాలతోనే కార్మికుల, శ్రామికుల, కర్షకుల, అన్ని వర్గాల ప్రజల సమస్యలకు విముక్తి కలుగుతుందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం మండలంలోని భీమవరం గ్రామంలో స్వర్గీయ గొల్లపూడి రాజారావు వర్ధంతి సభకు హాజరై ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ప్రభాకర్, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


కల్లూరులో పండిచిన వరిచేను


కల్లాల్లో ఆరబోసిన ధాన్యం


కాంటా వేసిన ధాన్యాన్ని ట్రాక్టర్లలో మిల్లులకు తరలిస్తున్న దృశ్యం

రైతుల 'పంట' పండింది

- ఖరీఫ్ సీజన్‌లో అధికంగా వరిసాగు
- కొనసాగుతున్న కోతలు
- కల్లూరు డివిజన్‌లో 34 లక్షల టన్నుల దిగుబడి
- గతేడాది కంటే 9 లక్షల టన్నుల అధికం

కల్లూరురూరల్: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతుల వేసిన వరి పంట పండింది. కల్లూరు డివిజన్లోని ఆరు మండలాల్లో సుమారు 34 లక్షల క్వింటాళ్ల వరి ధాన్యం దిగుబడి వస్తుందని.. జిల్లాలోనే అధికంగా కల్లూరు మండలంలో సుమారు 11లక్షల క్వింటాళ్ల దిగుబడి రావచ్చని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. వ్యవసాయశాఖ అంచనా ప్రకారం కల్లూరు మండలంలో 11 లక్షల క్వింటాళ్ల వరి, పెనుబల్లిలో 5.5 లక్షల క్వింటాళ్లు, సత్తుపల్లిలో 4.80 లక్షలు, వేంసూరులో 4.20 లక్షలు, తల్లాడలో 6.10 లక్షలు, ఏన్కూరులో 2.40 లక్షల క్వింటాళ్ల వరి ధాన్యం దిగుబడి అవుతుందని భావిస్తున్నారు. గతేడాది కంటే ఈ సారి సుమారు 9 లక్షల క్వింటాళ్ల వరి ధాన్యం అదనంగా దిగుబడి అయ్యే అవకాశం కనిపిస్తోంది. ప్రస్తుతం సగం వరకు వరికోతలు కోయగా.. మరోసగం కోతలు కొనసాగుతున్నాయి.

ప్రభుత్వ ప్రోత్సాహంతో..

ఈ ఏడాది ప్రభుత్వ ప్రోత్సాహం వల్ల రైతులు సన్న రకం ధాన్యాన్ని 70శాతం సాగు చేశారు. వీటిలో 5204 రకం సాంబమసూరి, హెచ్‌ఎంటీ సోనా మసూరి, ఆర్‌ఎన్‌ఆర్3179 రకం ధాన్యాన్ని, అదే విధంగా దొడ్డు రకం ధాన్యం ఎంటీయూ 1010, ఎంటీయూ 1001 ధాన్యాన్ని సాగు చేశారు. సన్న ధాన్యం మద్దతు ధర క్వింటాకు రూ.2,320లతో పాటు బోనస్‌గా క్వింటాకు రూ.500 చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించటంతో రైతులు సన్న ధాన్యం విరివిగా పండించారు.

విస్తారంగా వర్షాలు..

ఏడాది వర్షాకాలంలో సాధారణం కంటే అధికంగా వర్షపాతం నమోదైంది. దీంతో చెరువులు, కుంటలు నిండిపోయాయి. నాగార్జునసాగర్ కాల్వల ద్వారా సాగుకు సాగర్ ఎడమ కాలువ పరిధిలోని మధిర బ్రాంచ్ కెనాల్‌కు సాధారణంగా 650 నుంచి 750 క్యూసెక్కుల నీరు విడుదల చేయాల్సి ఉండగా 900 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. చెరువులకు సైతం నీటితో నింపివేశారు. వర్షాపాతం ఈ ఏడాది మొత్తం 40శాతం గా నమోదైంది. దీంతో నీరు పుష్కలంగా ఉండటంతో పంటలు దండిగా పండాయి.

చీడపీడలు లేవు.. తగ్గిన ఖర్చులు..

ఖరీఫ్ సీజన్‌లో వరి పంటకు అంతగా చీడపీడలు సోకలేదు. దీంతో రైతుకు ఖర్చు చాలా తగ్గింది. సాధారణంగా సన్నరకం వరి పంటకు అనేక రోగాలు సోకుతాయి. కానీ ఏడాది వాతావరణం అనుకూలంగా ఉండటంతో వరి పంటకు ఎటువంటి తెగుళ్ల ఆశించలేదు. సాధారణంగా సన్న వరి ధాన్యం ఎకరానికి 20 నుంచి 25 బస్తాల వరకు దిగుబడి వస్తుంది. కానీ ఈ ఖరీఫ్ సీజన్‌లో 25 నుంచి 35 బస్తాల వరకు దిగుబడి వచ్చినట్లు తెలుస్తోంది.

సన్న ధాన్యం సాగు పెరిగింది..



రాష్ట్ర ప్రభుత్వం ఈ ఖరీఫ్ సీజన్‌లో సన్న ధాన్యం సాగు చేస్తున్న రైతులకు క్వింటాకు మద్దతు ధర రూ.2,320లతో పాటు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పటంతో సన్న రకం ధాన్యం సాగు చేశాము. సాధారణంగా సన్న ధాన్యం సాగుకు ఖర్చు ఎక్కువ అవుతుంది. అయినప్పటికీ ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులంతా మూకుమ్మడిగా సన్న ధాన్యం వేశాం. ధాన్యం డబ్బులతో పాటు బోనస్ కూడా ఎకౌంట్లో వేయాలి.

– తాళ్లూరి శ్రీనివాసరావు, రైతు, పెద్దకోరుకొండి

సాగునీరు, వాతావరణంతో మంచి దిగుబడులు..



ఈ ఖరీఫ్ సీజన్‌లో పుష్కలంగా సాగునీరు, మంచి వాతావరణం వల్ల ధాన్యం దిగుబడులు పెరిగాయి. ఖరీఫ్ సాగుకు వాతావరణం అనుకూలించింది. అందువల్లనే వరికి ఎటువంటి వైరస్‌లు, చీడపీడలు సోకలేదు. క్రిమి సంహారక మందుల వాడకం కూడా చాలా వరకు తగ్గింది. ఈ ఖరీఫ్ సీజన్ రైతులకు లాభదాయకంగా ఉంది.

– శీలం నాగిరెడ్డి, రైతు, కప్పలబంధం

ఘనంగా కార్తీక మాస పూజలు


కొణిజర్లలో రుద్ర యాగం నిర్వహిస్తున్న భక్తులు

కొణిజర్ల: కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా మండలంలోని పలు శైవ దేవాయలయాలు కిక్కిరిసాయి. కొణిజర్ల, పల్లిపాడు, తనికెళ్ల, రెడ్డిగూడెంలోని శివాలయాల్లో తెల్లవారు జాము నుంచే భక్తులు బారులు తీరారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం..


వైరారూరల్: సామూహిక కుంకుమార్చన పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వైరారూరల్/ముదిగొండ: మండలంలోని అష్టగుర్తి గ్రామంలో గల అంజనేయ స్వామి దేవాలయంలో, ముదిగొండలోని శ్రీలక్ష్మీనరసింహాస్వామి, చెన్నకేశవ స్వామి దేవాలయాల్లో కార్తీకమాసం సందర్భంగా సోమవారం సామూహిలక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కుంకుమార్చన పూజలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకులు రొంపిచర్ల చిన్న నరసింహాచార్యులు, యోగానందం ఆచార్యులు, కిషోరాచార్యులు, సత్యార్థచార్యులు, యగ్నేష్‌చార్యులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని, పూజలు చేశారు.

శివాలయంలో..

కారేపల్లి: కారేపల్లిలోని రైల్వే స్టేషన్ రోడ్‌లోని శ్రీ విఘేశ్వర విశ్వేశ్వర సీతారామాంజనేయ శివాలయంలో కార్తీక సోమవారం సందర్భంగా భక్తులు శివలింగానికి పూజలు నిర్వహించారు. శివాలయ భక్తమండలి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు నాగసాయిశర్మ, వెంకటేశ్వరరావుశర్మ ఆధ్వర్యాన స్వామికి 30 కేజీల బియ్యంతో అన్నాభిషేకం చేశారు.

లక్ష దీపోత్సవం..


సత్తుపల్లిలో లక్ష దీపోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

సత్తుపల్లి(సత్తుపల్లి టౌన్): సత్తుపల్లి పట్టణంలోని వెంగళరావునగర్‌లో గల శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో కార్తీకమాసం సోమవారం సందర్భంగా ఘనంగా లక్ష దీపోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు రామడుగు గురుబ్రహ్మాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

బేతుపల్లి శివాలయంలో..

సత్తుపల్లి(సత్తుపల్లిరూరల్): మండలంలోని బేతుపల్లిలోని శ్రీభువనేశ్వరిసమేత గౌతమేశ్వరస్వామి శివాలయాన్ని టీజీఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మానస నాని, మట్టా ప్రసాద్, దొడ్డా రాజేంద్రప్రసాద్, కాలినేని సాయి, నాగళ్ల భాస్కర్ పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మాలధారుల ఇరుముడి

ఏన్కూరు: మండలంలోని తూతకలింగన్నపేట కొదండ రామాలయంలో సోమవారం అయ్యప్ప స్వాములు ఇరుముడి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. 41 రోజులపాటు కఠినమైన దీక్షతో, నియమాలతో 75 మంది అయ్యప్ప మాలధారులు పూజలు నిర్వహించారు. చివరి రోజుల ఇరుముడి కార్యక్రమం నిర్వహించి మేళతాళల నడుమ ఊరేగింపు నిర్వహించి శబరిమలైకు తరలి వెళ్లారు. గురుస్వామి బండారు కేశవరావు స్వామి ఆధ్వర్యంలో ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు.

మాలల సింహగర్జనకు తరలి రావాలి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

మధిర: వచ్చేనెల ఒకటిన హైదరాబాదులో జరిగే మాలల సింహగర్జన సభకు మాలలు అధిక సంఖ్యలో తరలి రావాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ రాష్ట్ర కన్వీనర్ లింగాల రవికుమార్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని గండమాల ప్రసాద్ నివాసంలో నిర్వహించిన మాలల ముఖ్య నాయకులు సమావేశంలో సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాలలు అన్ని వర్గాలను కలుపుకొని ప్రజాస్వామ్య రాజ్యాంగ పరిరక్షణకు చారిత్రాత్మక ఉద్యమాలు నిర్వహించారన్నారు. మాదిగల అభివృద్ధిని మాలలు ఏనాడూ అడ్డుకోలేదన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు మధిర నియోజకవర్గ కన్వీనర్ నల్లపు శేఖర్ సహాయ కన్వీనర్లు బోల్లెద్దు రాజేందర్, జూపూడి వెంకటేశ్వరరావు, వేల్పుల శివ, బెజ్జం ఆదాం, ఆశీర్వాదం, నల్లపు కవి రాజ్ తదితరులు పాల్గొన్నారు.

నిరసనలను జయప్రదం చేయాలి


మాట్లాడుతున్న బొంతు రాంబాబు

వైరా: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతులు, కార్మికుల వ్యవతిరేక విధానాలను నిరసిస్తూ కిసాన్ మోర్చా, ఆల్ ట్రేడ్ యూనియన్స్ ఆఫ్ ఫ్లాట్ ఫామ్ పిలుపు మేరకు ఈ నెల 26వ తేదీన దేశవ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లోని కలెక్టర్ కార్యాలయాల వద్ద నిర్వహించే నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని రైతు, కార్మిక సంఘాల నాయకులు కోరారు. వైరాలోని బోడేపూడి వెంకటేశ్వరరావు భవనంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో రాంబాబు, అర్జున్‌రావు, గోపాలరావు, చలపతిరావు, శ్రీనివాసరావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వితరణలు వెల్లువ..

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం

మధిర: మండలంలోని మాటూరు గ్రామానికి చెందిన పేద విద్యార్థిని పల్లెపాటి విఘ్నేశ్వరికి.. చేడె శ్రీనివాస్ మిత్రబృందం సోమవారం ఆర్థిక సాయం అందించారు. విఘ్నేశ్వరి ప్రస్తుతం బీటెక్ మూడో సంవత్సరం చదువుతుంది. ఆమె తండ్రి మూడేళ్లక్రితమే మరణించడంతో బీటెక్ ద్వితీయ సంవత్సరమే ఫీజుకోసమై తమ ఇంటిస్థలాన్ని తాకట్టుపెట్టి మరీ చదివింది. ప్రస్తుతం ఆమె ఫీజు కట్టకపోవడంతో కళాశాల యాజమాన్యం పరీక్షలకు అనుమతించలేదు. దీంతో ఆమె కూలీ పనుల చేసుకుంటుండగా.. విషయం తెలుసుకున్న సంక్రాంతి శ్రీనివాస్ విషయాన్ని హోమియో మిత్ర బృంద సభ్యుడు చేడె శ్రీనివాస్‌కు తెలుపగా.. ఆయన గోల్డెన్ హ్యాండ్స్ గ్రూప్ ద్వారా రూ.49 వేలు విద్యార్థినికి అందజేశారు. అంతేకాకుండా కుందా సావిత్రి సేవా సమితి నిర్మాణ దాత కుందా కోటేశ్వరరావు 6 నెలల పాటు హాస్టల్ సౌకర్యానికి అయ్యే ఖర్చు ప్రతి నెలా రూ.5 వేలు ఇవ్వడానికి అంగీకరించారు. అలాగే కొంత మంది దాతలు రూ.6 వేలు అందజేశారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తుడికి..

కల్లూరురూరల్: మండలంలోని కిష్టయ్య బంజరు గ్రామానికి చెందిన గిరిజన యువకుడు భూక్యా భీక్యకు రెండు కిడ్నీలు పాడైపోయాయి. వైద్యం చేయించలేని దీన స్థితిలో ఉండగా.. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు సోమవారం కిష్టయ్య బంజరు గ్రామానికి వెళ్లి బాధితుడికి ఆర్థిక సాయం అందించి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లక్కినేని కృష్ణ, ఏనుగు సత్యంబాబు, పసుపులేటి శ్రీనివాసరావు, బైర్ల కాంతారావు, ఖమ్మంపాటి పుల్లాచారి, తోట సుబ్బారావు, రాజబోయిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.50,211 వితరణ

సత్తుపల్లి(సత్తుపల్లి టౌన్): పట్టణంలోని ద్వారకాపురి కాలనీ రోడ్‌-7లో నిర్మాణంలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి సత్తుపల్లి మండలం గంగారం గ్రామానికి చెందిన మందపాటి ప్రసాద్‌రెడ్డి, వెంకట్రావమ్మ, కుమారులు బుచ్చిరెడ్డి, అనూష, చరణ్‌కుమార్‌రెడ్డి, ఈశ్వర్‌కుమార్‌రెడ్డి, నర్సింహారెడ్డి, వాసంతి, నిహితారెడ్డి, లాస్యారెడ్డి కుటుంబ సభ్యులు స్వామికి పంచలోహ కిరీటం, శంఖు చక్రాలు అభరణాలు నిమిత్తం రూ.50,211లు విరాళంగా గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, దేవాలయ నిర్మాణ బాధ్యులు ద్రోణంరాజు మల్లికార్జున శర్మ, చైర్మన్ సోమిశెట్టి శ్రీధర్, ప్రధాన కార్యదర్శి ఉబ్బన వెంకటేశ్వరరావు, శాశ్వత చైర్మన్ రాగాల చలంద్రారెడ్డి, కోశాధికారి రాగాల రమేష్‌రెడ్డిలు దాతలను స్వామి శేష వస్త్రంతో సత్కరించారు.

విద్యార్థినులకు శానిటరీ కిట్లు..

సత్తుపల్లి(కల్లూరు): కల్లూరు బాలికోన్నత పాఠశాల విద్యార్థినులకు సోమవారం స్ఫూర్తి ఫౌండేషన్ సహకారంతో తోపుడుబండి ఫౌండేషన్ నిర్వాహకులు శానిటరీ కిట్లు అందించారు. ఈ సందర్భంగా తోపుడుబండి ఫౌండేషన్ నిర్వాహకురాలు ఉషా దయాల్ మాట్లాడుతూ.. పదో తరగతి కామన్ పరీక్షల్లో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు రూ.5 వేలు చొప్పున బహుమతి అందిస్తామన్నారు. కార్యక్రమంలో రాజమండ్రి డీఎంఅండ్‌హెచ్‌ఓ దయాల ఆశ, దయాల కిషోర్‌దత్, మాజీ వార్డు సభ్యులు అఫ్రోజ్, పీఈటీ వీరరాఘవయ్య, రామారావు పాల్గొన్నారు.

పొలం గట్లపై కలెక్టర్!


రైతుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్


హార్వెస్టర్‌పై కూర్చుని వరికోతలను పరిశీలిస్తున్న కలెక్టర్


మహిళలు రూపొందించిన ఉత్పత్తులను పరిశీలిస్తున్న దృశ్యం

తల్లాడ: ప్రతీ వారం తహసీల్‌లో జరిగే ప్రజావాణిని పరిశీలించేందుకు సోమవారం తల్లాడకు వచ్చిన కలెక్టర్ ముజమ్మిలఖాన్ అక్కడ దరఖాస్తులపై ఆరా తీయడమే కాక రైతుల సమస్యలను తెలుసుకునేందుకు పొలాల బాట పట్టారు. తల్లాడలో ప్రజావాణికి హాజరైన అనంతరం కలెక్టర్ తలాడ-మంగాపురం రోడ్డులో సాగు చేసిన వరి పైరును పరిశీలించారు. వరి కోస్తున్న హార్వెస్టర్‌పై కూర్చుని పనితీరును తెలుసుకున్నారు. అనంతరం అక్కడ రైతులతో సమావేశమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రైతులు తమ్మిశెట్టి ఇన్నయ్య, లక్ష్మీనరసయ్య, పుల్లారెడ్డితో మాటట్లాడగా వారు కూలీలు దొరకకపోవడంతో హార్వెస్టర్లను ఆశ్రయిస్తున్నామని, వీటితో త్వరగా వరి కోతలు పూర్తవుతున్నాయని చెప్పారు. అలాగే, వరి సాగు విధానం, దిగుబడి, కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు ఉన్నందున పిల్లలను చేర్పించి, ప్రైవేట్ పాఠశాలల్లో చెల్లించే ఫీజులను పిల్లల పేరిట పొదుపు చేసుకోవాలని, ఆయిల్‌పామ్‌పై దృష్టి సారించాలని సూచించారు. కాగా, వ్యవసాయమంటే తనకెంతో ఇష్టమని, కానీ అది ఎంతో కష్టంతో కూడుకున్నదని కలెక్టర్ తెలిపారు.

సమస్యలు ఇక్కడే పరిష్కారం కావాలి..

మండల స్థాయి అధికారులు బృందంగా పనిచేస్తూ సాధ్యమైనంత మేర సమస్యలు ఇక్కడే పరిష్కారం అయ్యేలా కృషి చేయాలని కలెక్టర్ ముజమ్మిలఖాన్ సూచించారు. తహసీల్‌లో జరిగిన ప్రజావాణికి హాజరైన ఆయన 19 దరఖాస్తులకు పది దరఖాస్తులు పరిష్కారమయ్యాయని తెలిపారు. ఇదేతీరులో విధులు నిర్వర్తించాలని సూచించారు. ఈమేరకు మల్లవరానికి చెందిన దివ్యాంగుడు పెన్షన్, రేషన్ కార్డు కోసం, కుర్నవల్లి సొసైటీలో అవతకవకలపై విచారణ చేయించాలని రైతులు ఫిర్యాదు చేశారు. అనంతరం తల్లాడలో ఇందిరా మహిళా శక్తి ద్వారా ఏర్పాటు చేసిన ఫ్యాన్సీ జనరల్ స్టోర్‌ను ప్రారంభించిన కలెక్టర్, అంజనాపురంలో స్వయం సంఘాల సభ్యులు చేసిన ఉత్పతుత్లను పరిశీలించి విక్రయానికి ఏర్పాటు చేస్తామని తెలిపారు. డీఆర్‌డీఓ ఎస్.సన్యాసయ్య, ఇన్‌చార్జ్ తహసీల్దార్ వనజ, ఎంపీడీఓ చంద్రమౌళి, వివిధ శాఖల ఉద్యోగులు దర్గయ్య, శ్రీనివాస్, ఎం.డీ.తాజుద్దీన్, దామోదర ప్రసాద్, శ్రీదేవి, సింధు, రత్నమనోహర్, సాయికుమార్, శివకుమార్, మురళీకృష్ణ పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట


సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

వైరారూరల్: పేదల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని స్నానాల లక్ష్మీపురంలో 22మంది లబ్దిదారులకు కల్యాణలక్ష్మీ, 23మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఆ తర్వాత డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతు పక్షపాతిగా పని చేస్తే కొనుగోలు కేంద్రాల్లో రైతులకు బోనస్ నగదును అందిస్తూ ఆర్థిక భోరసా కల్పిస్తున్నట్లు వివరించారు. ఆయన వెంట రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మండల, పట్టణ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతారాములు, రంగారావు, రామకృష్ణ, పుల్లయ్య, అశోక్, వీరయ్య, గంగారావు, కృష్ణారావు, తహశీల్దార్ శ్రీనివాస్, ఏడీఏ కరుణశ్రీ, ఏఓ మయాన్ మంజుఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన


మాట్లాడుతున్న మట్టా దయానంద్

వేంసూరు: అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన చేస్తుందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ అన్నారు. సోమవారం మండలంలోని అమ్మపాలెంలో నిర్వహించిన కాంగ్రెస్ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ చరిత్ర కాటా వేసిన 48 గంటల్లో రైతులకు రూ.500 బోనస్ ఇస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని తెలిపారు. డిసెంబర్ ఒకటి నుంచి 9 వరకు నిర్వహించే ప్రజాపాలన విజయోత్సవాల్లో నాయకులు కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పుచ్చాకాయల సోమిరెడ్డి, కాంతరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సత్యనారాయణరెడ్డి, రాఘవరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసరావు, ఫైజుద్దీన్, నాయకులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ డే ను సద్వినియోగం చేసుకోవాలి



ఎర్రుపాలెం: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు

ఎర్రుపాలెం: మండలంలోని ప్రజలు తమ తమ సమస్యల పరిష్కారానికై ప్రతీ సోమవారం మండలపరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్ డే ను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఉషాశారద కోరారు. ఈ సందర్భంగా సమస్యలు పరిస్కరించాలని కోరుతూ.. పలువురు బాధితులు దరఖాస్తులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సురేందర్, ఐడీఎస్ ఏసీడీపీఓ కృష్ణశ్రీ, ఆర్ఐ రవికుమార్, ఏఓ సాయిశివ పాల్గొన్నారు.

రహదారికి శాశ్వత మరమ్మతులు చేపట్టాలి..

బోనకల్: కలకోట నుంచి మోటమర్రి వరకు గల రహదారికి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు కోరారు. స్థానిక రైతువేదికలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సీపీఐ ఆధ్వర్యంలో నాయకులు రోడ్డుకు సంబందించి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పవన్, శ్రీనివాసరావు, మోహన్‌రావు పాల్గొన్నారు.

డబుల్ ఇళ్లకు మరమ్మతులు చేయించాలి..

శిథిలావస్థకు చేరుకున్న డబుల్ ఇళ్లకు మరమ్మతులు చేయాలని కోరుతూ.. సీపీఎం నాయకులు ప్రజావాణి నిర్వహిస్తున్న రైతు వేదిక వద్ద ధర్నా నిర్వహించి అధికారులకు వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కిలారు సురేష్, నాయకులు పంతు, నరేష్, గురవయ్య, భూషయ్య, దయానంద్, పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుండా దుకాణాలు నడపొద్దు..

బోనకల్: లైసెన్స్‌లు లేకుండా ఎరువులు, ఫెస్టిసైడ్స్ దుకాణాలను నడిపితే సీజ్ చేసి పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేస్తామని మధిర ఏడీఏ స్వర్ణ విజయచంద్ర హెచ్చరించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం నిర్వహించిన డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. డీలర్లు లైసెన్స్‌లను రెన్యూవల్ చేయించుకునేందుకు 30 రోజుల ముందు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దుకాణంలో అందరికీ లైసెన్స్ కనిపించేలా, స్టాక్ వివరాలను పెట్టాలన్నారు. స్టాక్ రిజిస్టర్, బిల్ పుస్తకాన్ని విడిగా మండల వ్యవసాయాధికారికి అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ పసునూరి వినయ్ కుమార్, చింతకాని ఏఓ సోములపల్లి మానస, వ్యవసాయ విస్తరణాధికారులు, డీలర్లు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల వన సమారాధన

మధిర(చింతకాని): మండలంలోని పాతర్లపాడులోని మామిడితోటలో మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సోమవారం వన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య కుటుంబాలు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను చేసుకుని ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు పసుమర్తి చందర్‌రావు, ఖమ్మం నగర అధ్యక్షుడు గుమ్మడివెల్లి శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షుడు రాధాకృష్ణమూర్తి, వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, ఖమ్మం కార్పొరేటర్ రామ్మోహన్‌రావు, జిల్లా ఆర్యవైశ్య సంఘం మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీవి ప్రజా వ్యతిరేక విధానాలు'

తల్లాడ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని టీయూసీఐ ఏరియా కమిటీ కార్యదర్శి డి.శ్రీనివాసరావు అన్నారు. తల్లాడలో సోమవారం హమాలీ కార్మికులతో కలిసి బీజేపీ వ్యతిరేక విధానాలపై ప్రచారం చేశారు. కేంద్రం ప్రభుత్వ విదానాలపై మంగళవారం నాడు చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీయూసీఐ నాయకులు ఎస్.కె.లాల్‌మియా, పటాన్ నాగుల్ మీరా, రమణ, రామకృష్ణ, రాఘవ, రాంబాబు, రామయ్య, రోశయ్య, నాగసైదులు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.